క్లుప్తంగా

మాజీ సైనికులకు సన్మానం

జలుమూరు: త్రివిధ దళాలతోపాటు పారామిలటరీలో పనిచేసిన పదవీ విరమణ పొందిన వారిని సన్మానించడం మనకు గర్వకారణమని సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, ఎంపీటీసీ సభ్యుడు కరికోల హరిప్రసాద్ అన్నారు. సంక్రాంతి సబరాలలో భాగంగా మాజీ సైనికులైన కోటేశ్వరరావు, కృష్ణారావు, వెకంటరావు, సోమేశ్, గణపతిరావులను గ్రామ పెద్దలతో పాటు చేయూత గ్రూపు సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండల కేంద్రంలోని ఉజ్జయిని మహంకాళి ఆలయ 23వ వార్షికోత్సవాన్ని మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక, విశేష పూజలు, కుంకుమార్చనలు, అభిషేకాలను పురోహితులు వల్లభరాయుడు, శ్రీనివాసరావు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు ఆలయ ప్రాంగణంలో అరటి గెలలు వేలాడదీసి మొక్కులు తీరుకున్నారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం



బహుమతులు అందజేస్తున్న గ్రామ పెద్దలు

పొందూరు: మండలంలోని రాపాక గ్రామంలో వివేకానంద గ్రంథాలయ 7వ వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 2023లో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి, విద్యారంగంలో ప్రతిభను కనబర్చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొంచాడ రమణమూర్తి, వండాన వెంకటరావు, కె.గిరిబాబు, పోతురాజు సూర్యారావు, బలగ శంకరభాస్కర్, వండాన అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ



గోపూజ నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, రామారావు

నరసన్నపేట: మండల పరిధిలో కనుమ సందర్భంగా మంగళవారం గోపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరన్నాయుడు కాలనీలో సామాజిక సమరత వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోపూజలో జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, విశ్రాంత తహసీల్దార్ యు.లింగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నేతింటి సింహాచలం, బగ్గు రమణయ్య పాల్గొన్నారు. గోవులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

ఘనంగా పార్వేట ఉత్సవం



సంతపేట మండపంపై ఉన్న విగ్రహాలను పూజిస్తున్న భక్తులు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామికి ఏటా నిర్వహించే పార్వేట ఉత్సవం మంగళవారం సాయంత్రం సంతపేట ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించి సంతపేటలోని మండపంపై భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కనుమ రోజున ఏటా ఈ పార్వేట ఉత్సవం నిర్వహిస్తామని అర్చకులు చామర్తి కృష్ణబాబు తెలిపారు. ఇదే ప్రాంగణంలో యాత్ర జరిగింది. అలాగే పారశిల్లి, చెన్నాపురం గ్రామాల్లోని ఆలయాల వద్ద యాత్రలు చేపట్టారు.

పోస్టాఫీస్ తనిఖీ

బూర్జ: మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌ను పోస్టల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖరావు మంగళవారం తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ, రికార్డుల తనిఖీ, సిబ్బంది పనితీరు, సమయ పాలనపై పోస్టుమాస్టర్ ఎస్.కృష్ణారావుకు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అప్పన్న, నిఖిత ఉన్నారు.

సహస్ర దీపారాధన



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పాతపట్నం: స్థానిక ఆల్ ఆంధ్రా రోడ్డులోని షిర్డీ గిరిపై ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో సంక్రాంతి, కనుమ సందర్భంగా సోమ, మంగళవారాల్లో సహస్ర దీపారాధన నిర్వహించారు. ఉదయం, సాయంత్రం సాయి సంకీర్తలను ఆలపించారు. ప్రత్యేక పూజలు, బాబాకు హారతి ఇచ్చామని కమిటీ సభ్యులు పి.తారకేశ్వరరావు తెలిపారు.



ఎల్.ఎన్.పేట: శ్యామలాపురంలో మ్యూజికల్ చైర్ గేమ్ ఆడుతున్న మహిళలు



కొత్తూరు: ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాన్ని తీరువీధి నిర్వహిస్తున్న సీతారామ ఆలయ అర్చకులు, భక్తులు



బూర్జ: దొంకలపర్తలో గోమాతను పూజిస్తున్న మహిళ



ఆమదాలవలస రూరల్: బెలమాంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు

సరదాల సంక్రాంతి

గ్రామాలు, పట్టణాల్లో సంక్రాంతి, కనుమ సంబరాలు సోమ, మంగళవారం ఘనంగా నిర్వహించారు. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించిన రోజున సంక్రాంతి.. ఆ మరుసటిరోజు కనుమ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. యువతులు ముగ్గుల పోటీల్లో పాల్గొని, అందమైన రంగవల్లులు వేయగా, చిన్నారులు సరదాగా పతంగులు ఎగురవేశారు. ప్రతి ఇంట్లో కొత్త బియ్యంతో చేసిన పరమాన్నం పితృదేవతలకు నైవేద్యంగా సమర్పించారు. గ్రామాల్లో వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కనుమ రోజు మాంసం దుకాణాలు కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: సీతారామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



సారవకోట: అవలింగిలో స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొన్న యువత



సారవకోట: వాండ్రాయిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఆర్‌పీఎఫ్ ఏసీపీ దేవాది కృష్ణారావు



కొత్తూరు: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న చికెన్, మటన్ దుకాణాలు



నరసన్నపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తున్న కళింగ కోమట్ల సంఘం ప్రతినిధులు



బూర్జ: సింగన్నపాలెంలో డాన్స్ చేస్తున్న యువతి

జన జాతర



జలుమూరు: పూజలు అందుకుంటున్న శ్రీమహావిష్ణువు



ఆమదాలవలస రూరల్: పూజలు అందుకుంటున్న సంగమేశ్వరుడు



ఆమదాలవలస రూరల్: పూజలందుకుంటున్న వల్లభనారాయణస్వామి



ఆమదాలవలస రూరల్: సంగమయ్య జాతరలో పాల్గొన్న జనం

ఆమదాలవలస రూరల్: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని రాష్ట్రంలో మొట్టమొదటిగా నిర్వహించే జాతర సంగమేశ్వర యాత్ర. ఈ జాతర ఆమదాలవలస పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న గాజులకొల్లివలస గ్రామం సమీపంలో గల సంగమేశ్వర కొండ వద్ద సంక్రాంతి, కనుమ సందర్భంగా సోమ, మంగళవారాలు నిర్వహించారు. ప్రాచీనకాలం నాటిదిగా గుర్తింపు పొందిన సంగమయ్య కొండను గోప కొండగా పిలుస్తారు. ప్రతీ ఏడాది ఇక్కడ జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. హిందూ, జైన, బౌద్ధ మతాలకు సంగమం అయిన సంగమయ్యను మకర సంక్రాంతి రోజున దర్శనం చేసుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందినవారు, ఇతర జిల్లాల నుంచి, ఒడిశా రాష్ట్రం నుంచి కూడా భారీగా జనం వచ్చి సంగమయ్య కొండను, గుహలో ఉన్న సంగమయ్యను దర్శించుకున్నారు. సంగమయ్య దర్శనం అనంతరం కొండ దిగువ ప్రాంతంలో నిర్వహించే జాతరలో వేలాది సంఖ్యలో జనం పాల్గొనటం విశేషం. ఈ జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు జాతర నిర్వహణ..

సంక్రాంతి మొదలుకొని మూడు రోజులపాటు నిర్వహించే సంగమేశ్వర జాతర ముక్కనుమ రోజు బుధవారం సాయంత్రం జరుగుతుంది. ముక్కనుముతో ఈ జాతర ముగుస్తుంది. మూడో రోజున వేలాది మంది యాత్రికులు పాల్గొంటారు.

సోమాలమ్మ జాతరకు

సరుబుజ్జిలి: పెద్దపాలెం గ్రామానికి సమీపంలో గల దంతపురిక్షేత్రంలో నిర్వహించిన సోమాలమ్మ తల్లి జాతరకు ప్రజలు భారీగా తరలివచ్చారు. పెద్దపాలెం, చిన్నపాలెం, పాలవలస, రావివలస, పురుషోత్తపురం, కొండవలస, రొట్టవలస గ్రామాలకు చెందిన ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పద్మనాభ కొండపై..

జలుమూరు: శ్రీముఖలింగం-కరకవలస గ్రామాల మధ్యన ఉన్న పద్మనాభ కొండపై ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం క్షేత్రపాలకుడు శ్రీమహావిష్ణువు జాతరను కనుమ పురస్కరించుకుని మంగళవారం కనుల పండువుగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఈ జాతర ఘట్టం జరిగింది. ఈ ఉత్సవాల్లో చుట్టు పక్కల గ్రామాలతో పాటు, హిరమండలం, జలుమూరు, ఎల్.ఎన్.పేట మండలాల నుంచి పెద్ద ఎత్తున జనాలు వచ్చారు. కరకవలసకు చెందిన యువత సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వల్లభనారాయణస్వామి జాతర..

ఆమదాలవలస రూరల్: నాగావళి నదీ తీరంలో గల తొగరాంలో కనుమ పురస్కరించుకుని మంగళవారం నిర్వహించే వల్లభనారాయణస్వామి జాతర సందడిగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి సందర్భంగా గ్రామంలో గల వల్లభనారాయణస్వామి ఆలయం వద్ద జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. జాతర ప్రారంభించే ముందు ఉదయం వల్లభనారాయణస్వామికి భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. పాడి పంటలు బాగా వృద్ధి చెందాలని స్వామి వారికి కానుకలు సమర్పిస్తారు. అనంతరం గుడి బయట నిర్వహించే జాతరలో పాల్గొని సందడి చేస్తారు. ఈ జాతరలో కలివరం, తొగరాం, కొత్తవలస, చీమలవలస, దిబ్బలపేట, ఇస్కలపేట, తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, ఫీర్‌సాహెబ్‌పేట, దూసి తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



సరుబుజ్జిలి: దంతపురిక్షేత్రంలో నిర్వహించిన జాతరకు తరలివచ్చిన ప్రజలు



ఆమదాలవలస రూరల్: వల్లభనారాయణస్వామి జాతరలో పాల్గొన్న ప్రజలు



జలుమూరు: పద్మనాభ కొండపైన నిర్వహించిన జాతరలో పాల్గొన్న భక్తులు



ఆమదాలవలస రూరల్: జాతరకు తరలివచ్చిన ప్రజలు

పాతపట్నంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు చర్యలు

- ఎల్.ఎన్.పేటలో పోలీసు స్టేషన్
- ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలో అగ్నిమాపక కేంద్రంతోపాటు ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు కె ధనుంజయరెడ్డి నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. కొత్తూరు మండల కేంద్రంలోనే అగ్నిమాపక కేంద్రం ఉందన్నారు. నియోజకవర్గం కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం లేకపోవటంతో పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం మండలాల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు టెక్కలి, పలాసలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని పర్లాఖిమిడి నుంచి అగ్నిమాపక శకటం రావాల్సి వస్తుందన్నారు. అగ్నిమాపక శకటం వచ్చేసరికి నష్టం జరిగిపోతుందని సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వివరిస్తూ వినతిపత్రాన్ని అందించానన్నారు. దీనిపై సీఎం జగన్ స్పందించి సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారన్నారు.

ఈ మేరకు సంబంధిత అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరుతూ సీఎం ముఖ్యకార్యదర్శి ధనుంజయరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఎల్.ఎన్.పేట మండల కేంద్రాన్ని 1999లో ఏర్పాటు చేశారన్నారు. సుమారు 25 ఏళ్లు కావస్తున్నా పోలీస్ స్టేషన్ లేకపోవటంతో శాంతిభద్రతల విషయంలో పోలీస్‌లు ఇబ్బంది పడుతున్నారన్నారు. పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని సీఎం ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి నుంచి పోలీసు అధికారులకు ఉత్తర్వులు వచ్చాయన్నారు. త్వరలోనే అగ్నిమాపక కేంద్రం, పోలీసు స్టేషన్ ఏర్పాటుతో సమస్యలు తీరనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

నీలమణిదుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పూజలందుకుంటున్న నీలమణిదుర్గ అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు పాతపట్నం, కొరసవాడ, కాగువాడ, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు వేలాదిగా ఘటాలతో తరలివచ్చారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి మరుచటిరోజు రావడం ఆనవాయితీగా భక్తులు వస్తుంటారని ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావు తెలిపారు. అమ్మవారికి ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారని తెలిపారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ఆమదాలవలస: మున్సిపాలిటీ పరిధిలో 7వ వార్డు చింతాడ గ్రామంలో న్యూ లైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్ ప్రాంగణంలోని న్యూ లైఫ్ టైలరింగ్ శిక్షణ కేంద్రం ద్వారా టైలరింగ్‌లో శిక్షణ పొందిన వారికి సోమవారం కుట్టు మిషన్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా న్యూ లైఫ్ ఎడ్యుకేషనల్ సంస్థ, వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ కె.శ్యామ్ మాథ్యూస్ మాట్లాడుతూ మహిళలను చైతన్యవంతులుగా తీర్చిదిద్ది స్వయం సాధికారిత సాధించేందుకు తమవంతు కృషి చేస్తున్నామన్నారు. ఆరు నెలలు టైలరింగ్ శిక్షణ పొందిన ఎనిమిదో బ్యాచ్ మహిళలకు ఇప్పుడు ఆర్థికంగా చేయూతనిస్తూ కుట్టు మిషన్లను పంపిణీ చేశామని తెలిపారు. న్యూ లైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్ట్ డైరెక్టర్, పాస్టర్ జి.కృపావరం మాట్లాడుతూ ఎంతో మంది మహిళలు టైలరింగ్ శిక్షణ ద్వారా ఉపాధి పొందుతూ వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని ఏ బేధం లేకుండా ప్రతి మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా సామాజికపరంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న అసోసియేషన్ శ్యామ్ మాథ్యూస్

నేడు శ్రీరాంపాడులో యాత్ర

నరసన్నపేట: మండల పరిధిలోని రెడ్డికిపేట-అంప్లాం గ్రామాల మధ్య గల బసివలస రోడ్డుకు ఆనుకొని ఉన్న శివాలయం వద్ద హలహలేశ్వరుని(శ్రీరాంపాడు) యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ మేరకు యాత్ర కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏటా ముక్కనుమ రోజున ఈ యాత్ర నిర్వహిస్తారు. నరసన్నపేట, జలుమూరు, పోలాకి మండలాల నుంచి వేలాది మంది యాత్రలో పాల్గొంటారు. 16వ శతాబ్దంలో ఉర్లాం గ్రామానికి చెందిన కొంక్యాన జగ్గునాయుడు ఈ శివాలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటినుంచి ఈ శివాలయం వద్ద ముక్కనుమ రోజున యాత్ర నిర్వహిస్తున్నారు. వచ్చిన వారందరికీ ఉచితంగా ప్రసాదం అందజేయనున్నట్లు గొట్టిపల్లి, దూకులపాడు సర్పంచ్‌లు అవ్వ రవీంద్రనాథ్ రెడ్డి, అల్లు అసిరినాయుడు తెలిపారు. తాగునీరు సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. యాత్ర ప్రశాతంగా నిర్వహించేందుకు సహకరించాలని కమిటీ సభ్యులు శిమ్మ లక్ష్మణరావు కోరారు. అలాగే కంబకాయ కూడలిలో స్వయంబేశ్వరి స్వామి ఆలయం 74 వార్షికోత్సవం సందర్భంగా ముక్కనుమ రోజున యాత్ర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాగోటి కుసుమ కుమారి తెలిపారు.



శివాలయంలోని ఉత్సవ విగ్రహాలు

ఆత్మీయ సమ్మేళనం



2008-09 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

మెళియాపుట్టి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మంగళవారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుకున్న రోజుల్లో జరిగిన పలు విషయాలను గుర్తు చేసుకుంటూ ఆనందం గడిపారు. ఒకరని ఒకరు అప్యాయతగా కౌలిగించుకుని కష్టసుఖాలు తెలుసుకున్నారు. బ్యాచ్‌లో ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు అయితే ఆర్థిక సహాయం చేసేందుకు తీర్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం సహకరించేందుకు చర్యలు తీసుకుందామని తీర్మానించారు. పూర్వ విద్యార్థులు గంగాడ ప్రదీప్ కుమార్, బండారు హిరప్రసాద్, పుండ్ల చంద్రశేఖర్, లాడి ప్రియాంక పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.